జోన్-2లో వెల్లువెత్తిన ఓటరు చైతన్యం

- తూర్పులో అభ్యర్థుల గెలుపులో కీలక పాత్ర
- కార్పొరేటర్ల ఎన్నికల్లో 5 వార్డులకు 4 వైఎస్సార్‌సీపీ కైవసం



11వ వార్డు గాంధీనగర్ ఎంపీపీ స్కూల్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు(ఫైల్)

ఆరిలోవ: సాధారణ ఎన్నికల పోలింగ్ ఈ నెల 13న ప్రశాంతంగా ముగిసింది. తూర్పు నియోజకవర్గంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో జీవీఎంసీ జోన్-2, జోన్-3 పరిధిల్లోని వార్డులకు చెందిన ఓటర్లు ఉన్నారు. జోన్-2 పరిధిలో 9 నుంచి 13 వరకు 5 వార్డులు ఉండగా.. జోన్-3 పరిధిలో 15 నుంచి 23 వార్డులతో పాటు 28వ వార్డు కూడా ఉంది. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,92,206 మంది ఉన్నారు. ఈ నెల 13న జరిగిన పోలింగ్‌లో 2,00,563 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్న విషయం తెలిసిందే. ఇందులో జోన్-2 పరిధి ఓటర్లు నియోజకవర్గానికి కీలకంగా మారారు. 2009లో నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఈ ప్రాంతం సాధారణ ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తోంది.

నియోజకవర్గంలో మూడో వంతు ఓటర్లు ఇక్కడే ఉన్నారు. వీరు ఎవరికి అనుకూలంగా ఓటు వేస్తే వారినే విజయం వరిస్తోంది. ఆరిలోవ, పైనాపిల్ కాలనీ, ఆదర్శనగర్, డెయిరీఫారం నుంచి, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం వరకు ఈ ప్రాంతం విస్తరించి ఉంది. విశాలమైన ప్రాంతంతో పాటు నిరుపేద, మధ్య తరగతి, ధనిక వర్గాలతో పాటు అన్ని సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు ఇక్కడ ఉన్నారు. ఈ ప్రాంత ప్రజలు ఆదరించిన పార్టీ అభ్యర్థికే విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

జోన్-2లో వార్డుల వారీగా పోలైన ఓట్లు

వార్డు	బూత్‌లు	ఓటర్లు	పోలైన ఓట్లు
9	17	17,197	12,017
10	18	18,635	14,553
11	20	19,943	14,917
12	18	18,956	14,210
13	20	20,811	15,835

2019 ఎన్నికల వరకు ఈ ప్రాంతం టీడీపీకి అనుకూలంగా ఉండడంతో వరుసగా వెలగపూడి విజయం సాధిస్తూ వచ్చారు. ఇప్పుడు 2021 నుంచి ఆ సీను రివర్స్ అయింది. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టి సంక్షేమ పథకాలు అమలు చేయడంతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరింది. దీంతో 2021లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఇక్కడ ప్రజలు ఆదరించారు. ఈ ప్రాంతంలో ఉన్న 5 వార్డుల్లో నలుగురు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను కార్పొరేటర్లుగా గెలిపించి జీవీఎంసీకి పంపించారు. ఇదే పరిస్థితి 2024 సాధారణ ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణకే ఉంటుందని నియోజకవర్గంలోని రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది. ఈ ఆదరణ ఎవరికి ఉంటుందో జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు వరకు వేచి చూడాల్సిందే.

మొత్తం ఓట్లు 95,542.. పోలైన ఓట్లు 71,532

తూర్పు నియోజకవర్గం జోన్-2 పరిధిలోని 5 వార్డుల్లో 71,532 ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ 9 నుంచి 13వ వరకు వార్డ్‌లు ఉన్నాయి. ఆయా వార్డుల్లో 95,542 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో ఆయా వార్డుల్లో ఉన్న 93 బూత్‌లలో 71,532 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వారిలో పురుషులు కంటే మహిళలే సుమారు 2 వేల మంది వరకు ఎక్కువగా ఓటేశారు.

క్లుప్తంగా

ఎంవీపీ రైతుబజార్ సందర్శన



ఎవీపీ రైతు బజార్‌లో మార్క్‌ఫెడ్ ప్రొడక్ట్స్ పరిశీలిస్తున్న ఎండీ శేఖర్ బాబు

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌ను ఆదివారం మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.శేఖర్‌బాబు సందర్శించారు. రైతుబజార్‌లో భారత్ శనగ పప్పు, మార్క్‌ఫెడ్ ఉత్పత్తుల విక్రయాలను పరిశీలించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై అందించిన శనగపప్పు విక్రయాలకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. ఎన్ని కిలోల శనగపప్పు విక్రయం జరిగిందో అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వినియోగదారుల కోసం అందుబాటులో ఉన్న మార్క్‌ఫెడ్ ఉత్పత్తుల గురించి సిబ్బంది ఆరా తీశారు. విక్రయాల్లో ఎటువంటి అవకతవకలకు పాల్పడవద్దని హెచ్చరించారు.

ఉత్కల్ సమాజ్ నూతన కార్యవర్గం



ఎన్నికైన ఉత్కల్ సమాజ్ కార్యవర్గం సభ్యులు

బీచ్‌రోడ్డు: ఉత్కల్ సంస్కృతిక సమాజ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. సిరిపురంలోని ఉత్కల్ సమాజ్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా జె.కె.నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కె.కె.పది, కార్యదర్శిగా బిమిల్ కుమార్ మహంత్, ట్రెజరర్‌గా మహేశ్వర బెహరతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం ఏడాది పాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి సభ్యులు అభినందనలు తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం



బస్సును ఢీకొన్న కారు

కొమ్మాది : ఎండాడ జాతీయ రహదారి వద్ద ఆదివారం పెద్ద ప్రమాదం తప్పింది. ఎండాడ నుంచి మధురవాడవైపు వ్యతిరేక దిశలో వెళ్తున్న ఓ కారు టైర్ పేలిపోవడంతో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారు ముందు బాగం నుజ్జయింది. ప్రమాదంలో ఎవరికీ ప్రాణాపాయం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి



ఆరిలోవలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ: కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం తోటగరువు దరి బీఎస్‌ఆర్ నగర్ సీపీఎం కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన చిత్ర పటానికి ఆరిలోవ సీపీఎం జోన్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జోన్ నాయకులు మాట్లాడుతూ సుందరయ్య ఉన్నత కుటుంబంలో జన్మించి పేదల బతుకులు బాగుపడాలని ఉద్యమాలు చేపట్టారన్నారు. దేశ సేవ కోసం జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. దున్నే వాడిదే భూమి అనే నినాదంతో తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రజలను సన్నద్ధం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరిలోవ జోన్ సీపీఎం నాయకులు ఎస్.నరేంద్రకుమార్, జి.ప్రియాంక, నాగరాజు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

సాధనతోనే కళాకారులుగా రాణింపు



జ్యోతి ప్రజ్వలనతో పోటీలు ప్రారంభిస్తున్న సంగీత విద్వాంసుడు ద్వారం త్యాగరాజు

సీతంపేట: సరస్వతి అమ్మవారి ప్రతిరూపంగా సంగీతం ఆవిర్భవించిందని సంగీత విద్వాంసుడు ద్వారం త్యాగరాజు అన్నారు. అన్నమాచార్యుని జయంతిని పురస్కరించుకుని శృతిలయ సేవా సంస్థ వ్యవస్థాపకుడు వి.ప్రభాకర్ సారథ్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అన్నమాచార్య సంకీర్తన పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా త్యాగరాజు జ్యోతిప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ కళాకారుడికైనా భక్తి, శ్రద్ధ, ఏకాగ్రత, సాధన ఎంతో అవసరమని, సాధనతోనే ఉత్తమ సంగీత కళాకారులుగా రాణిస్తారన్నారు. తేనె వంటి తెలుగు పదాలతో వేంకటేశ్వర స్వామిని సంకీర్తన రూపంలో కీర్తించిన ఘనత అన్నమాచార్యుడికే దక్కిందన్నారు. మంచి కార్యక్రమం నిర్వహించారని శృతిలయ సంస్థ వ్యవస్థాపకులను అభినందించారు. ఈ నెల 23న అన్నమాచార్య జయంతి రోజున విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. నాలుగు విభాగాల్లో జరిగిన పోటీల్లో సుమారు 300 మంది కళాకారులు సంగీతంపై తమకున్న ప్రతిభ చాటారు.

కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు, శృతిలయ సంస్థ కార్యదర్శి ఎం.ఎస్.మాధవ్, కొణతాల రాజు, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, సిహెచ్.వి.సత్యనారాయణ, మేడా మస్తాన్‌రెడ్డి, కె.మంజుల, శారద, సుజని పాల్గొన్నారు.

కోలాహలంగా ఎర్నిమాంబ జాతర





ఆలయంలో కొలువైన ఎర్నిమాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

కంచరపాలెం: జ్ఞానాపురం, అల్లిపురం ప్రజల ఇలవేల్పుగా కొలిచే ఎర్నిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం ఆలయ ఈవో డీవీవీ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకుడు పూలఖండం శ్రీకాంత్‌శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్, 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు

నగరంలోని పలు ప్రాంతాలతోపాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మూలవిరాట్‌ను వేలాది మంది భక్తులు సుమారు 252 అమ్మవారి ప్రతిమలతో దర్శించుకున్నారు. అనంతరం అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. జాతరలో నేల వేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. పలు సంఘాల ప్రతినిధులు భక్తులకు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. దేవదాయశాఖ సిబ్బంది, ఆలయ చైర్మన్, సిబ్బంది ఉత్సవాలను పర్యవేక్షించారు.



మూలవిరాట్ వద్ద అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ఎయిడ్స్ మృతులకు నివాళి

మహారాణిపేట : ఎయిడ్స్‌తో మృతి చెందిన వారిని గుర్తు చేసుకుంటూ వారి పట్ల ప్రేమ, సంఘీభావం తెలియచేద్దామని, వారి కుటుంబ సభ్యులకు ఉపశమనం కలిగిద్దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఒక ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. ఆదివారం 'అంతర్జాతీయ ఎయిడ్స్ దీప స్మృత్యంజలి దినం' నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ప్రారంభించారు. రేసపువానిపాలెం వద్ద డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి మొదలైన ర్యాలీ సత్యం కూడలి, రామాటాకీసు వరకు సాగింది. ఈ సందర్భంగా పలువురికి న్యూట్రిషన్ పౌడర్ అందజేశారు. అనంతరం హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌తో చనిపోయిన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ఆరిలోవ: ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. రెండేళ్లకు ఒకసారి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా కాలపరిమితి పూర్తికావడంతో పాత కార్యవర్గం ఇటీవల రద్దయింది. దీంతో అసోసియేషన్ సభ్యులు ఆదివారం నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ముగ్గురు వ్యక్తులు అధ్యక్ష పదవికి పోటీలో నిలవడంతో ఎన్నికల పరిశీలకులుగా అల్లంపల్లి రాజబాబు, కొరికాన మోహనరావు, పి.వెంకటేశ్వరరావు వ్యవహరించి పోలింగ్ చేపట్టారు. ఈ పోలింగ్‌లో అధ్యక్షుడిగా పి.శ్రీనివాసరావు, కోశాధికారిగా సీహెచ్.సత్యనారాయణ ఎన్నికయ్యారు. వారిరువురు ఇతర సభ్యులతో కలిసి ప్రధాన కార్యదర్శిగా ఎస్.రవికుమార్‌ను నియమించారు. గౌరవాధ్యక్షులుగా కె.మోహనరావు, సి.సాయికుమార్, ముఖ్య సలహాదారుగా ఎ.రాజబాబు, సలహాదారుగా జి.విక్టర్, ఉపాధ్యక్షులుగా రమణ, చిన్నను నియమించారు. నూతన కార్యవర్గానికి అసోసియేషన్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం సభ్యులు హామీ ఇచ్చారు.

రహదారిపై జారిపడిన కాంక్రీట్



రహదారిపై ఉన్న పచ్చి కాంక్రీట్

ఏయూ క్యాంపస్: రామ్‌నగర్ నుంచి గవర్నర్ బంగళాకు వెళ్లే మార్గంలో పచ్చి కాంక్రీట్ ఎక్కడికక్కడ కుప్పగా దర్శనమిస్తోంది. వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం ఉదయం భవన నిర్మాణాలకు రెడీమిక్స్ కాంక్రీట్ సరఫరా చేసే వాహనం నుంచి ఇది జారిపడినట్లు తెలుస్తోంది. సదరు వాహన డ్రైవర్ పట్టించుకోకుండా వెళ్లిపోవడంతో రోడ్డుపై ప్రయాణించే వారికి ప్రమాదకరంగా మారింది. నిత్యం నగరంలో పలు ప్రాంతాలలో ఇదే విధంగా కాంక్రీట్ రోడ్డుపై పడిపోవడం కనిపిస్తోంది. ఈ కాంక్రీట్ ఎండ తీవ్రతకు రోడ్డుకు అతుక్కుపోతోంది. జీవీఎంసీ సిబ్బంది స్పందించి వెంటనే కాంక్రీట్ తొలగిస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటోందని వాహన చోదకులు కోరుతున్నారు.

కొనసాగుతున్న చందనం అరగదీత

సింహాచలం: సింహాద్రి అప్పన్న ఆలయంలో రెండో విడత చందనం అరగదీత ఆదివారం కూడా కొనసాగింది. ఈ నెల 23న వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని స్వామికి రెండో విడతగా మూడు మణుగుల(120 కిలోలు) పచ్చి చందనం సమర్పించనున్నారు. దీనిలో భాగంగా తొలిరోజు శనివారం 40 కిలోలు చందనం అరగదీయగా రెండో రోజు ఆదివారం 37 కిలోల చందనాన్ని అరగదీశారు. రెండు రోజుల్లో 77 కిలోల చందనం సమకూరింది. సోమవారం కూడా చందనం అరగదీత చేపట్టనున్నారు.

శాకంబరిగా చినపోలమ్మవారు



కాశీవిశ్వేశ్వర శ్రీఅన్నపూర్ణదేవి అలంకరణలో చిన పోలమాంబ అమ్మవారు

మద్దిలపాలెం : శివాజీ పాలెంలో చిన పోలమాంబ అమ్మవారు ఆదివారం కాశీవిశ్వేశ్వర శ్రీఅన్నపూర్ణదేవి అలంకరణ(శాకంబరి అవతారం)లో భక్తులకు దర్శనమిచ్చారు. వార్షికోత్సవంలో భాగంగా రోజూ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. శాకంబరి అలంకరణలో అమ్మవారిని మహిళలు అధిక సంఖ్యలో దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

జీవ వైవిధ్య ఉద్యానవనంలో సందడి



పార్కు విశేషాలు తెలుసుకుంటున్న కళాశాల విద్యార్థులు



మొక్కల ప్రత్యేకతలు వివరిస్తున్న డాక్టర్ శ్రీరామమూర్తి



ఇంటిలో పెంచుకునే మొక్కలతో విద్యార్థులు

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరులోని రాణి చంద్రమణిదేవి ఆస్పత్రి ఆవరణలో ఉన్న జీవ వైవిధ్య ఉద్యానవనం ఆదివారం సందడిగా కనిపించింది. ఈ పార్కును అల్లిపురంలోని యూనిటీ డిగ్రీ కళాశాల, సెయింట్ జోసఫ్ కళాశాల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులో మొక్కల విశేషాలు, ప్రత్యేకతలను పార్కు నిర్వాహకుడు డాక్టర్ మంథా శ్రీరామమూర్తి వివరించారు. వేలాది జాతులకు చెందిన మొక్కలను ఒకే చోట చూసి విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. పుస్తకాలలో ఉన్న మొక్కల విశేషాలను ప్రత్యక్షంగా వీక్షించి సంభ్రపడ్డారు. విద్యార్థులకు ప్రత్యక్ష ప్రయోగశాలగా ఈ ఉద్యానవనం నిలుస్తోందని శ్రీరామమూర్తి తెలిపారు. ఫార్మసీ, వృక్షశాస్త్రం విభాగాల విద్యార్థులు నిత్యం ఈ జీవవైవిధ్య ఉద్యానవనాన్ని సందర్శిస్తున్నారని చెప్పారు. వేసవి కాలం కావడంతో మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కల్యాణం.. కమనీయం

- వైభవంగా బల్లిగిరి వెంకన్న వార్షిక తిరు కల్యాణం
- గోవింద నామస్మరణతో మార్మోగిన బల్లిగిరి



జీలకర్ర బెల్లం కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు



కన్యాదానంలో పాల్గొన్న ఈవో రమాబాయి, ధర్మకర్తల మండలి చైర్మన్ బొడ్డేటి కిషోర్



కల్యాణంలో పాల్గొన్న దంపతులు

అల్లిపురం : బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక తిరు కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. వైశాఖ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. చిరు మొగ్గల సిగ్గులొలికే బుగ్గలతో, పసిడి కాంతులీనుతూ.. పెండ్లి కూతుళ్లుగా, బుగ్గన చుక్కతో దేవేరులు శ్రీదేవీ, భూదేవీల మధ్య ముగ్ధ మనోహర రూపంలో కాంతులీనుతున్న వెంకన్న స్వామి కల్యాణ వైభోగం చూసిన వారు ధన్యులయ్యారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం అంకురార్పణ, గరుడ పతాక ధ్వజస్తంభ అధిరోహణ, విశేష హోమాలను ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి తిరుకల్యాణోత్సవం సందర్భంగా తిరువీధి ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవదాయ శాఖ తరఫున ఆలయ ఈవో జీవీ రమాబాయి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు గొడవర్తి రఘునాథశర్మ పర్యవేక్షణలో ఆగమ పండితులు స్వామి వారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న జంటలు కల్యాణం జరిపించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు చేసిన నృత్యాలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. అనంతరం కల్యాణ దంపతులను వేదపండితులు ఆశీర్వదించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మంచిగా జీవించండి



ద్వారకా పీఎస్‌లో రౌడీషీటర్లకు సూచనలిస్తున్న సీఐ రమేష్, ఎస్‌ఐ శ్రీను



ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్‌ఐ వెంకటరావు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఎస్.రమేష్ మాట్లాడుతూ ఎటువంటి నేరాలకు మళ్లీ పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. గొడవలు చేయడం, హద్దు మీరి ప్రవర్తించడం వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవని రౌడీషీటర్లను హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని, మంచిగా జీవించాలని హితవు పలికారు. కౌన్సెలింగ్ అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద పోలీసులు అప్పగించారు. ఎస్‌ఐ శ్రీను, ఏఎస్‌ఐ గంగాధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

- ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు ఎస్‌ఐ వెంకటరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని వారికి ఎస్‌ఐ సూచించారు. ఎటువంటి నేరాలు చేయకుండా మంచిగా ఉండాలన్నారు.

తీరం... జనసంద్రం



కొమ్మాది: తీరంలోని పర్యాటక ప్రాంతాలన్నీ జనంతో కిటకిటలాడాయి. ఆదివారం ఉదయం నుంచి భానుడు భగభగలాడడంతో సాయంత్రం కాస్త ఉపశమనం కోసం బీచ్‌కు చేరుకున్నారు. వందలాది మంది పర్యాటకులు సాగర్‌నగర్ బీచ్, రుషికొండ, తొట్లకొండ, భీమిలి బీచ్‌లో స్నానాలు చేస్తూ, ఎండ నుంచి ఉపశమనం పొందారు.